క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కందుకూరు: మండల పరిధిలోని ముచ్చర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ దాసర్లపల్లి, 11కేవీ ముచ్చర్ల ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కోసం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తిగిరి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

బీఆర్ఎస్ నేతకు మాతృవియోగం

మహేశ్వరం: బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ఉపాధ్యాక్షుడు కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజ్ తల్లి లక్ష్మమ్మ మృతి చెందడంతో వారి భౌతికాయానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు మహేశ్వరం మాజీ సర్పంచ్ ప్రియాంకను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఎస్సీ కమిషన్ మాజీ డైరెక్టర్ చిలకమర్రి నర్సింహ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అంబయ్య యాదవ్, శివగంగ ఆలయ మాజీ చైర్మన్లు మునగపాటి నవీన్, నిమ్మగూడెం సుధీర్ గౌడ్, మాజీ సర్పంచ్ ఆనందం తదితరులు ఉన్నారు.

కాలనీల సమస్యలను పరిష్కరిస్తాం


స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ శంకర్‌నాయక్

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ శంకర్ నాయక్ అన్నారు. నవచైతన్య కాలనీలో శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి పర్యటించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. యూపీఎస్ పక్కన ఉన్న బోరు మోటార్‌ను శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య, వాటర్‌మెన్‌లు గణేశ్, అభిరామ్ కలిసి మరమ్మతు చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. నీటి సమస్య లేకుండా సరఫరా చేస్తున్నామని తెలిపారు. నల్లాలకు మోటార్లు పెట్టడం, డబుల్ నల్లాలు, సైజుకు మించి తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జేఏసీ నేతల అరెస్టు


పోలీసుల అదుపులో జేఏసీ నాయకులు

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం మాడ్గుల, వెల్దండలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావ్‌ల పర్యటన నేపథ్యంలో గట్టుప్పలపల్లి మండల సాధన సమితి నాయకులను శుక్రవారం ఉదయం తలకొండపల్లి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మంత్రుల పర్యటనకు అడ్డుకుంటారని భావించి, జేఏసీ చైర్మన్ మకురాల అశోక్‌గౌడ్, నాయకులు వెంకటయ్య, శరత్‌చంద్ర, మహేశ్, శరత్‌లను అదుపులోకి తీసుకున్నారు. మంత్రుల పర్యటన అనంతరం విడిచిపెట్టారు.

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ


రాములును పరామర్శిస్తున్న క్యామ మల్లేశ్

ఇబ్రహీంపట్నం: మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములును బీఆర్ఎస్ నాయకుడు, భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్ పరామర్శించారు. ఇటీవల రాములు సతీమణి ముత్యాలమ్మ అనారోగ్యంతో మరణించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం క్యామ.. మాజీ ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి, ముత్యాలమ్మ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు.

ముగ్గురు ఎస్ఐలు బదిలీ

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ముగ్గురు ఎస్ఐలు బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్తవారు నియమితులయ్యారు. ఇక్కడ నిన్నటి వరకు పని చేసిన రాజు ఘట్కేసర్ ఐటీ కారిడార్ పోచారం ఠాణాకు, బాలరాజు ఎల్బీనగర్ ట్రాఫిక్, సుధాకర్‌రెడ్డి ఎల్బీనగర్ సీసీఎస్‌కు బదిలీపై వెళ్లారు. వీరి స్థానంలో బి.సత్యనారాయణ, నోయల్‌రాజ్, సైదయ్యలు వచ్చారు. ఈ ముగ్గురు ఇటీవలే ట్రైనింగ్ పూర్తి చేసుకొని మొదటి పోస్టింగ్‌లో చేరారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేయడంతో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.



లెనిన్‌నగర్ రైతుబజార్ వద్ద అసంపూర్తిగా డబుల్ బెడ్రూం ఇళ్లు


పట్టా పేపర్లతో నిరసన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

డబ్బులు ఇస్తేనే 'డబుల్' ఇళ్లు

- వసూళ్లకు తెరలేపిన స్థానిక నేతలు
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న స్థానికులు

మీర్‌పేట: డబ్బులిస్తే డబుల్ బెడ్రూం ఇళ్లు ముందుగా మీకే అందిస్తాం.. అందరూ మా వెనకే ఉన్నారు.. మేము చెప్పిందే ఫైనల్.. కొందరు స్థానిక నాయకులు వసూళ్ల దందాకు తెరలేపారు. బ్లాక్ నెంబర్.. ఫ్లాట్ నెంబర్‌లు సైతం వీరే నిర్ణయించడం విశేషం. వివరాలు.. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి లెనిన్‌నగర్ రైతుబజార్ వద్ద సర్వే నెం-119లో గుడిసెలు వేసుకుని నివాసముంటున్న వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు గత ప్రభుత్వం సర్వే చేపట్టి 255 మంది లబ్ధిదారులను గుర్తించి పట్టాలు మంజూరు చేసింది. 2021 డిసెంబరులో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఐదు బ్లాకుల నిర్మాణం పూర్తి చేసి ముందుగా 80 మంది కుటుంబాలకు లాటరీ ద్వారా ఇళ్లు కేటాయించింది. మిగిలిన బ్లాకుల్లో 32 ఫ్లాట్ల పనులు 60 శాతం వరకు పూర్తయి కొంత కాలంగా నిలిచిపోయాయి.

రూ.35 వేలు అడ్వాన్స్

త్వరలోనే మిగిలిన బ్లాకుల నిర్మాణం పూర్తవుతుందని ఇందుకు ముందుగా తాము నిర్ణయించిన మొత్తం నగదును ఎవరైతే ఇస్తారో వారికే ఇళ్లను అందజేస్తామని స్థానికంగా ఉండే కొందరు నాయకులు లబ్ధిదారులను నమ్మించారు. ముందుగా రూ.35వేలు, ఇళ్లలోకి వెళ్లాక మరో రూ.15 వేలు చెల్లించాలని నిర్ణయించారు. దీంతో దాదాపు 50 మందికి పైగా రూ.35వేలు చెల్లించారు. నెలలు గడుస్తున్నా ఇళ్ల నిర్మాణం పూర్తికాకపోవడం.. తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వకపోవడంతో వసూలు చేసిన వారిపై లబ్ధిదారులు ఒత్తిడి పెంచారు. దీంతో చేసేది లేక స్థానిక నాయకులు నిర్మాణ దశలోనే ఉన్న ఇండ్లలోకి ప్రవేశించాలని, అలాగైతేనే ఇండ్లు మీ సొంతం అవుతాయని చెప్పడంతో గురువారం తెల్లవారుజామునే లబ్ధిదారులు తమ సామగ్రితో సహా గృహప్రవేశం చేశారు. అక్కడే నివాసముంటున్న లబ్ధిదారుల్లోని ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో వెంటనే బాలాపూర్ తహసీల్దార్, మీర్‌పేట పోలీసులు అక్కడికి చేరుకుని లబ్ధిదారులకు నచ్చజెప్పి ఇళ్లను నుంచి ఖాళీ చేయించడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది.

చర్యలు తీసుకోవాలి

డబుల్ బెడ్రూం ఇళ్ల పేరిట పేదల వద్ద డబ్బులు వసూలు చేసిన వారిని రెవెన్యూ అధికారులు గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికంగా గుడిసెలు వేసుకుని నివాసముంటున్న వారు కోరుతున్నారు. నిర్మాణం పూర్తి కాకుండానే, లాటరీ తీయకుండానే అక్రమంగా డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్న వారిపై రెవెన్యూ, పోలీసు శాఖలు కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గోరింటాకు వేడుక

కందుకూరు: ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే సబితారెడ్డి సమక్షంలో మాజీ మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గోరింటాకు వేడుకలు నిర్వహించారు. గోరింటాకుతో మహిళలకు విడదీయరాని అనుబంధమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు టి.ఇందిరాదేవేందర్, మాజీ ప్రజాప్రతినిధులు లలిత, జ్యోతి, సదాలక్ష్మి, కాకి ఇందిరమ్మ, నాయకులు ఎస్.జయమ్మ, ఎం.జయమ్మ, మాజీ సర్పంచులు మన్నె జయేందర్‌ముదిరాజ్, టి.దేవేందర్ పాల్గొన్నారు.


గోరింటాకు వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి, మహిళా నాయకులు

సంస్థాగత నిర్మాణమే బలమైన పునాది

కందుకూరు: కాంగ్రెస్ పార్టీకి సంస్థాగత నిర్మాణమే బలమైన పునాది అని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బాచుపల్లిలో మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ ఆదేశాల మేరకు గ్రామ కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా కృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా శ్రీశైలం, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కల్యాణ్‌కార్ లక్ష్మీబాయి, ఎస్టీసెల్ అధ్యక్షుడిగా కృష్ణ, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా జహంగీర్, ఇందిరమ్మ కమిటీ విజయ్, సభ్యులుగా నవీన్‌గౌడ్, యుగంధర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ క్లస్టర్ కన్వీనర్ ఈశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదయ్య, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నర్సింహ, మండల పర్యవేక్షకుడు రాజ్‌నాయక్ తెలిపారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వెంకటేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్, నాయకులు శ్రీశైలం, బాలమల్లేష్‌యా దవ్, నాగేష్‌గౌడ్, మల్లేష్, రాఘవేందర్, కె.అంజయ్య, కె.మహేష్, పి.భాస్కర్, కె.ధనుంజయ్, పి.మహేందర్, పి.కుమార్, ఎ.రాములు, కె.దేవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.



తుక్కుగూడ: వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వాణి


పహాడీషరీఫ్: వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న కమిషనర్ వెంకట్రామ్

కార్మికుల శ్రేయస్సుకు కృషి

మున్సిపల్ కమిషనర్ వాణి

తుక్కుగూడ: మున్సిపల్ కార్మికుల శ్రేయస్సుకు తమవంతు కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఎ.వాణి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి పారిశుద్ధ్యకార్మికులు, మహిళా సంఘాల సభ్యులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 40వ రోజు ఈ వైద్య శిబిరం నిర్వహించామన్నారు. కార్మికులు విధి నిర్వహణతో పాటు, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. 8వ వార్డులో తడి, పొడి చెత్త వేరు చేయడం, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వామన్‌గౌడ్, ఆర్ఐ మల్లేశ్, మున్సిపల్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

పహాడీషరీఫ్: విధి నిర్వహణతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, స్వయం సహాయక గ్రూప్ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ వైద్యులు ఈ సందర్భంగా సిబ్బందికి బీపీ, షుగర్, జ్వరం తదితర పరీక్షలను నిర్వహించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య సిబ్బంది అనారోగ్యం బారిన పడకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జ్యోతి రెడ్డి, టీపీఓ హబీబున్నీసా, డీఈ ఇష్రత్ ఆయేషా, పర్యావరణ అధికారి ఎం.శ్రీను, శానిటేషన్ సూపర్‌వైజర్ బి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం నిర్ణయం.. సామాజిక విప్లవానికి నాంది

పీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం: బీసీల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్ఆర్ ఆదేశానుసారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు ఆర్డినెన్స్ తీసుకురావాలని మంత్రి వర్గం నిర్ణయించడం సామాజిక విప్లవానికి నాంది అన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రి వర్గానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న కాంగ్రెస్‌కు బీసీలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహ, మహేశ్వరం ఏఎంసీ వైస్ చైర్మన్ యాదయ్య, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్, ఆవుల యాదయ్య, సీనియర్ నాయకులు నేనావత్ రాజు నాయక్, అంధ్యా నాయక్, ఎద్మ మోహన్‌రెడ్డి, చంద్రమోహన్, లాజర్, కంది రమేశ్, నర్సింహ యాదవ్, జంగయ్య, పాండు ముదిరాజ్, నర్సింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

తుక్కుగూడ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినందుకుగాను వేడుకలు నిర్వహించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు గోగికర్ జానకీరామ్ నాయకులు బోద పాండురంగారెడ్డి, యాదయ్య, రాజ్‌కుమార్, చిన్నారెడ్డి, స్వామి, రాజు, బాల్‌రాజ్, యాదయ్య, గిరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ మీటింగ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తూ శుక్రవారం కందుకూరు చౌరస్తాలో రాహుల్‌గాంధీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రి వర్గానికి, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎస్.మల్లేశ్, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, డైరెక్టర్ యుగంధర్‌గౌడ్, నాయకులు అజీజ్, బి.సంజీవరెడ్డి, శేఖర్‌గౌడ్, వి.బాబు, దర్శన్, పాండురంగారెడ్డి, జి.కుమార్, ఎం.రమేశ్, పి.కృష్ణ, మహేందర్, శ్రీకాంత్, జగదీశ్, శ్రీనివాస్‌గౌడ్, నవీన్, మహేందర్, బురాన్ పాల్గొన్నారు.


మహేశ్వరం: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దేప భాస్కర్‌రెడ్డి తదితరులు


తుక్కుగూడలో..



కందుకూరులో..

ప్రజా భాగస్వామ్యమే ప్రధానం

కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: అభివృద్ధి పనులలో ప్రజల భాగస్వామ్యం ఉంటే ఆ పనులు త్వరగా పూర్తి అవుతాయని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. శుక్రవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్‌పాటిల్‌ని ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. డివిజన్‌లో చేపట్టాల్సిన కీలక అభివృద్ధి పనులపై సమగ్రంగా చర్చించారు. ప్రధానంగా సీఎం రోడ్డు విస్తరణ పనులు జోనల్ కమిషనర్‌తో చర్చించడం జరిగిందని కార్పొరేటర్ తెలిపారు. సీఎం రోడ్డు విస్తరణ, 50 అడుగులా 60 అడుగులా, లేదా 80, 100 అడుగుల విస్తరణ కావాలా అనే అంశంపై స్పష్టత కోరారు. సరూర్‌నగర్ చౌడీ సర్కిల్ బ్యూటిఫికేషన్-పాత భవనం ప్రమాదకర స్థితికి చేరింది. భవనం ఎప్పుడెప్పుడు కూలిపోతుందో అన్న భయంతో స్థానికుల్లో నెలకొందని, అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. చెరువు పరిసరాలను పునరుద్ధరించి ప్రజలకు వాకింగ్, ఆరోగ్యవంతమైన వాతావరణం అందించే దిశగా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కోరారు.



అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్‌తో చర్చిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

ఓటరు జాబితాను పకడ్బందీగా నిర్వహించాలి


బీఎల్ఓల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు: ఓటర్ జాబితాను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశపుహాల్‌లో ఓటర్ల జాబితాపై బీఎల్ఓలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటర్ జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఒక పోలింగ్ స్టేషన్‌కు సంబంధించిన ఓటర్లు అంతా ఒకే దగ్గర ఉండేలా మ్యాపింగ్ చేయాలన్నారు. ఇంటి నంబర్లు తప్పుగా నమోదైతే సరి చేయాలన్నారు. ఏవైనా సమస్యలు వస్తే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శేఖర్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత


కళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న వెంకటేశ్

ఆమనగల్లు: విద్యారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. విద్యారంగంలో ప్రభుత్వం అనేక మార్పులు తీసుకువచ్చిందని తెలిపారు. అన్ని సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యతోపాటు, మౌలిక వసతులు కల్పిస్తుందని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం అందిస్తుందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే చిన్నారులకు యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు అందజేసిందని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావ్, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీధర్, రామస్వామి, అశోక్‌రెడ్డి, మాధవి, కృష్ణయ్య, వనిత, మాలతి, కుసుమలత, మధుకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జగన్, ప్రసాద్, మహేశ్, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు వేగిరం చేయండి

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల నుంచి సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి వెళ్లే రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎ.వాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు పనులు పూర్తికాక ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పార్టీ నాయకులు పాండురంగారెడ్డి, రాజ్‌కుమార్, తోటేడి గోవర్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి, బాల్‌రాజ్, స్వామి పాల్గొన్నారు.


కమిషనర్ వాణికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అభివృద్ధికి అడ్డుతగిలితే సహించం

- తప్పుడు ప్రచారం చేస్తే సహించం
- అవినీతి, అక్రమాలకు పాల్పడితే వదలిపెట్టం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: అభివృద్ధి పనులకు అడ్డు తగిలినా, తప్పుడు ప్రచారం చేసినా సహించేది లేదని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హెచ్చరించారు. ఇబ్రహీంపట్నం ప్రజాపాలన (క్యాంపు) కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత పాలకుల హయాంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని భూములు దోపిడీకి గురయ్యాయని ఆరోపించారు. వాటిని కబ్జా చేసిన వారి భరతం పడతామన్నారు. గడిచిన 16 నెలల కాలంలో రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు.

ఫ్యూచర్ సిటీతో మహర్దశ

అంబేడ్కర్ చౌరస్తా నుంచి పొల్కంపల్లి వరకు రూ.40 కోట్లతో నిర్మించే రోడ్డు పనులు, రూ.37 కోట్లతో నిర్మించే పట్నం వంద పడకల ఆస్పత్రి పనులను త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వివిధ అభివృద్ధి పనులకు పట్నం మున్సిపాలిటీకి రూ.15 కోట్లు, టీజీఐఐసీ నుంచి యాచారం మండలానికి రూ.20 కోట్లు మంజూరు చేయించామని వివరించారు. విషపూరిత కంపెనీలను వ్యతిరేకించిన తాను.. ఫార్మాసిటీని వ్యతిరేకించానని వెల్లడించారు. అయితే ఫార్మా పేరుతో భూములు తీసుకొని ఫ్యూచర్ సిటీని ఎలా ఏర్పాటు చేస్తారని పేర్కొంటూ.. కొందరు న్యాయస్థానంలో ఆ పనులను ఆటంకం కలిగించేందుకు చూశారని, అందుకే ప్రభుత్వం కాలుష్యరహిత గ్రీన్ ఫార్మా సిటీగా పేరుమార్చిందని చెప్పారు. ఫ్యూచర్ సిటీతో యాచారం, కందుకూర్ మండలాలకు మహర్దశ పట్టనుందన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి